నమస్తే తెలంగాణ
వరంగల్ హనుమకొండ
ఆదివారం 31 మార్చి 2024
WARANGAL HANUMAKONDA




సిద్దెంకిలో నీరులేక ఎండిపోయిన వరి



## మేకల మేతకు వాడుతున్నం

జనగామ రూరల్, మార్చి 30 : మేము రెండెకరాల్లో వరి సాగు చేసినం. నీళ్లు లేక ఎకరం పూర్తిగా ఎండిపోయింది. పక్కనే కాలువ ఉన్నా నీళ్లు రాక పొలం బీటలువారి పంట చేతికిరాకుండా పోయింది. బోర్లు, బావులు కూడా అడుగంటినయ్. ఉన్న నీళ్లను పశువులకు, మిగతా పొలానికి వంతుల వారీగా వాడుకుంటున్నం. ఎండిపోయిన పంటను మేకలకు మేత కోసం వాడుతున్నం.

–ల్యాగల భాను, యువరైతు, పెద్దరాంచర్ల, జనగామ మండలం

## రెండెకరాల పంట పోయింది

జనగామ రూరల్, మార్చి 30 : మాకు నాలుగెకరాలు ఉంది. మూడు ఎకరాల్లో వరి ఏసినం. నీళ్లందక పొట్ట దశలో ఎకరం, ఈనిన తర్వాత ఎకరం మొత్తం రెండెకరాలు ఎండిపోయింది. ఉన్న ఎకరానికి విడుతల వారీగా నీరందిస్తున్నం. పక్కనే నాగిరెడ్డి కుంట చెరువున్నా అదిప్పుడు చుక్క నీరు లేక ఎండిపోయింది. పంటను కాపాడుకునేందుకు గోస పడుతున్నం.

–చెన్నూరి భాగ్య, రైతు, సిద్దెంకి గ్రామం, జనగామ మండలం







# అన్నదాతల అరిగోస

## సాగు నీళ్లందక చుట్టుముట్టిన కరువు కోరలు

- ఎండిన పంటలతో గగ్గోలు
- జీవాలకు మేతగా పైర్లు
- అప్పుల పాలయ్యామని కన్నీళ్లు

'బావులు, బోర్లు, చెరువులల్ల నీళ్లు అడుగంటినయ్.. పొట్ట దశకు వచ్చిన వరికి నీళ్లందక పంటలు ఎండిపోయినయ్.. చేతికందే దశలో పంటను కాపాడుకునేందుకు అరిగోస పడుతున్నం.. బీఆర్ఎస్ గౌర్మెంటు ఉన్నప్పుడు కాల్వల నీళ్లు వచ్చేటియి. చెరువులు, కుంటలు నిండుగ ఉండి బాయిల నీళ్లకు ఢోకా లేకుండేది. ఏదో చేస్తదని నమ్మి ఓటేస్తే కాంగ్రెస్‌ను నట్టేట ముంచుతాంది. కనీసం సాగునీళ్లియ్యక అరిగోస పెడుతాంది. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు మీదవడ్డయ్. మమ్ముల దేవుడే ఆదుకోవాలె' అని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటిలా పంటలు పండుతాయనే నమ్మకంతో ఈ యాసంగి వరి సాగు చేసిన రైతులకు, కాలువల ద్వారా నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కళ్లెదుటే పంటలు ఎండిపోతుండడంతో కన్నీళ్లను దిగమింగుతూ చేసేదేంలేక పైర్లల్లో పశువులను మేతకు తోలుతున్నారు. ఒక్క జనగామ మండలంలోనే 20వేల ఎకరాలకు గాను, దాదాపు 8వేల ఎకరాల్లో వరి ఎండిపోయింది. ఇలా జనగామ జిల్లావ్యాప్తంగా వేలాది ఎకరాల పంట కరువు కోరల్లో చిక్కుకుంది. ఈ దుస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు బాసటగా నిలిచేందుకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల మండలానికి వస్తున్నారు. మండలంలోని ధరావత్‌తండా, ధర్మాపురంలో ఎండిపోయిన పంటలను స్వయంగా పరిశీలించి రైతుల బాధలను తెలుసుకోనున్నారు. రైతులు, కూలీలను కలిసి వారి కష్టాలను అడిగి తెలుసుకొని ఓదార్చనున్నారు. ఉదయం 8గంటలకు ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి జనగామ, నెల్లుట్ల మీదుగా 10.30 గంటల వరకు సూర్యాపేట ప్రధాన రోడ్డులోని ధరావత్‌తండా, ధర్మాపురంలో పంటలను సందర్శిస్తారు. మార్గమధ్యంలో ఎక్కడైనా ఎండిన పంటలు కనిపిస్తే ఆగి పరిశీలించే అవకాశం ఉంది. కాగా కేసీఆర్‌కు చేర్యాల, బచ్చన్నపేట, జనగామ, నెల్లుట్ల వద్ద ఘన స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నారు.

*– నమస్తే తెలంగాణ జనగామ నెట్‌వర్క్, మార్చి 30*



## రూ.60వేల పెట్టుబడి పోయినట్లే

రఘునాథపల్లి మార్చి 30: నాకు ఊర్లె ఎనిమిదెకరాలు ఉంటే మూడున్నర ఎకరాల్లో వరి పంట వేసిన. ఎనిమిదేండ్ల సంది బోరు ఎత్తిపోయింది లేదు. పెట్టుబడికి ఇబ్బందులు కూడా కాలే. ఈ యేడు వరి పొట్ట దశకు వచ్చే సమయంలో బోర్ల నీళ్లు అడుగంటినయ్. రెండెకరాల్లో పశువులను మేపినం. ఎకరంనర చేతికస్తదనుకుంటే బోరు పూర్తిగా ఎండిపోయింది. నేను బోరు తవ్వించి ఎనిమిదేళ్లయింది. ఎప్పుడూ ఎండిపోలే. చెరువులు, కాల్వల నీళ్లు రాక బోర్లు వట్టిపోయినయ్. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు చెరువులు, కుంటలు నింపింది. ఇప్పటి ప్రభుత్వానికి రైతులకు సాగునీళ్లియ్యాలన్న సోయే లేదు. మమ్ముల దేవుడే ఆదుకోవాలె. – ముక్క పరశురాములు, రైతు, మేకలగట్టు, రఘునాథపల్లి మండలం

## కేసీఆర్ సర్కారుల మస్తు నీళ్లు..

నర్మెట, మార్చి 30 : కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు కాల్వల నుంచి మస్తు నీళ్లు వచ్చేది. ఇప్పుడు ఉన్నదాంట్ల సగం వరకు ఎండిపోయింది. నాకున్న నాలుగు ఎకరాలల్ల రెండెకరాల పొలం ఎండిపోయింది. నా భూమిలో ఒక్క బోరు ఉంది. అప్పుడేమో ఐదు ఎకరాలకు పెట్టుబడికి లక్ష దాటింది. భూమిలో నీళ్లు దిగిపోవడంతో మోటరు కూడా సక్కడ పోస్తలేదు. మా దగ్గర కాల్వ పని మొత్తం కాలేదు. ఇంతకుముందేమో కాల్వ లేకున్నా నీళ్లు వచ్చేది. ఇప్పుడు ఎవ్వరిని అడిగినా మాకు నీళ్లు వస్తలేవు అంటున్నరు. కేసీఆర్ ఉన్నప్పుడే మాకు నయం ఉండే. ఆయన రైతులకు రంది లేకుంట చేశిండు.

– భూక్యా సక్రు, సూర్యబండ తండా, నర్మెట మండలం





## రెండు బోర్లేసినా సుక్క నీరు రాలే

నర్మెట, మార్చి 30 : నాకున్నది మూడెకరాల పొలం. ఎండలు బాగా కొడుతుండడం వల్ల ఉన్న ఒక్క బోరు సక్కగ పోస్తలేదు. పోయినసారి కంటే సగం వరకు బోరు పోస్తలేదు. దీంతో పంటను కాపాడుకునేందుకు లక్ష వరకు ఖర్చు చేసి నా పొలంలో రెండు బోర్లు వేశాను. రెండింట్లో ఒక్క సుక్క నీరు రాలేదు. వరి పంట పూర్తిగా ఎండిపోయింది. జొన్న చేను కూడా వేసిన. అది కూడా నీరు లేక ఎండిపోతాంది. మమ్ములను ప్రభుత్వం ఆదుకొని ఆర్థిక సహాయం అందించాలి.

– భూక్యా దేవా, బండతండా, నర్మెట మండలం

## కాల్వలు మంచిగ చేయాలె



నర్మెట, మార్చి 30 : కాల్వలు మంచిగ లేక మాకు ఒక్క సుక్క కూడా గోదావరి నీళ్లు వస్తలేవు. మాకు ఐదు ఎకరాల భూమి ఉంది. అందులో రెండు బోర్లు ఉన్నాయి. ఐదు ఎకరాల్లో నాటు వేశాం. మొదట్లో బోర్లు మంచిగానే ఉన్నా .. ఈ మధ్యలో పూర్తిగా ఎండిపోయినయ్. దీంతో ఐదెకరాల పొలం మొత్తం ఎండిపోయింది. ఎండిన పొలం పశువులకు మేత అయింది. మా తండాకు గోదావరి నీళ్లు వచ్చేందుకు కాల్వలు కూడా సరిగా లేవు. వెంటనే పూర్తి చేసి మాకు నీళ్లు ఇయ్యాలె. ఎండిపోయిన రైతుల పొలాలను పరిశీలించి ప్రభుత్వం ఆదుకోవాలి. – భూక్యా రమేశ్, బండతండా, నర్మెట మండలం

## గిట్ల పశువులకు మేత ఐతదనుకోలే..

బచ్చన్నపేట, మార్చి 30 : మాది జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం లింగంపల్లి గ్రామం. నా పేరు పాశం శ్రీనివాస్. గ్రామంలో నాకున్నది ఆరెకరాల వ్యవసాయ భూమి. ఇదివరకు నాలుగెకరాల్లో వరి పెట్టిన మంచిగనే చేతికొచ్చింది. కానీ ఈసారి రెండెకరాలే సాగు చేసినం. బాయి ఎండిపోయింది. వేసిన రెండు బోర్లు ఎత్తిపోయినయ్. కండ్ల ముంగటనే కష్టపడి వేసిన వరి ఎండిపోయింది. చేసేదేమీ లేక పశువులను మేపుతున్న. ఇంతకుముందు గోదావరి నీళ్లతోటి చెరువులు, కుంటలు నింపుట్ల బావుల్లో నీళ్లు ఎప్పుడూ ఉండేది. బోర్లు కూడా మస్తు పోసేది. పదేండ్లు ఎవుసం బంగారం లెక్క చేసినం. ఇప్పుడే ఇంత కరువొచ్చింది. ఇన్ని తిప్పలు ఎన్నడూ చూడలే. పంటలకు తెచ్చిన పెట్టుబడి మీద పడ్డది. కనీసం తిండి మందం అన్న వస్తయ్ అనుకున్నం. కానీ గిట్ల పశువులకు మేత అయితదనుకోలే. ఇంత కన్నా దౌర్భాగ్య పరిస్థితి రైతుకు ఎప్పుడూ రావద్దు. సర్కారు ఆదుకోవాలె. అన్నదాతలకు అండగా నిలబడి ధైర్యమియ్యాలె.

– పాశం శ్రీనివాస్, రైతు, లింగంపల్లి, బచ్చన్నపేట మండలం



## ఎకరం పంట మొత్తం పోయింది

పాలకుర్తి, మార్చి 30 : నాకు రెండెకరాల 40గుంటల భూమి ఉంది. అందులో వరి వేసిన. మొదట్లో నీళ్లు మంచిగనే వచ్చేది. తర్వాత బోరు పారక పంట మొత్తం ఎండిపోయింది. రూ.20వేల దాకా పెట్టుబడి పెట్టిన. పంట పూర్తిగా ఎండిపోవడం వల్ల ఏం జేయాల్నో అర్థమైతలేదు. ఇదివరకు ఎన్నడూ గిట్ల కాలే. వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకుతున్నం. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలె.

– ఆజ్మీరా సోమ్లు, రైతు, హర్యాతండా, పాలకుర్తి మండలం



## నాలుగెకరాలు చేతికి రాలే



చిల్పూరు, మార్చి 30 : నేను నాలుగు ఎకరాల్లో వరి వేసిన. పంట చేతికందే సమయంలో నీరు లేక మొత్తం ఎండిపోయింది. దాదాపు రూ.2లక్షలు నష్టం. నాలుగెకరాల్లో మూడు బోర్లు వేస్తే ఒక్కదాంట్ల నీళ్లు పడ్డయ్. చెరువుల నీళ్లుంటెనే బోరు పోస్తది. ఈ సారి చెరువులకు నీళ్లు రాక బోరు వట్టిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతి ఊర్లె చెరువులను కాలువలతో నింపింది. రైతులకు నీళ్ల గోస లేకుండ చేసింది. కాంగ్రెస్ వచ్చిన కాన్నుంచి రైతులకు నీళ్లలేవు, రైతుబంధు లేదు..రుణమాఫీ లేదు. ఎండిన పంటలకు ప్రభుత్వమే పరిహారం అందించి ఆదుకోవాలె. – భోగి వెంకటమల్లయ్య, రైతు, మల్కాపూర్, చిల్పూరు మండలం

## గింత అధ్వానం అయితదనుకోలె..



దేవరుప్పుల, మార్చి 30 : ఎప్పటిలెక్క ఈసారి కూడ నీళ్లొస్తయన్న ఆశతో రెండెకరాలు నాటు పెడితె మొత్తం ఎండిపోయింది. గొడ్లు మేపినం. ఇంతపనైతదని అస్సలు అనుకోలె. మునుపటి తీరుగనే నీళ్లొస్తయని అనుకున్నం. సుక్క నీళ్లు రాలె. కాంగ్రెస్ సర్కారు రాంగనె కట్క తిప్పినట్టే బంద్దైనయ్. అప్పుల పాలైనం. ఇగ పట్నంల ఉప్పరి పనికి పోవుడే గతి. ఇంత అధ్వానం అయితదనుకోలె. నల్ల నీళ్లు కూడ సగం సగమే వస్తున్నయ్. అవిసుత రాకపోతే బిస్తరు కట్టుడే అయితదేమో. – కున్సోతు కమలమ్మ, చింతబావి తండా

# నీళ్లున్నా ఇవ్వలేని కాంగ్రెస్ సర్కారు

- పాలకులను నిలదీసేందుకే నేడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పర్యటన
- మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల, మార్చి 30 : దేవాదుల రిజర్వాయర్లలో నీళ్లున్నా పంటలకు ఇవ్వలేని పాలకులను నిలదీసి రైతులకు తానున్నానంటూ భరోసా కల్పించేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం రైతుల చెంతకు వస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దేవరుప్పుల మండలం చింత బాయితండా వద్ద ఎండిన పొలాలను పరిశీలించేందుకు ఆదివారం కేసీఆర్ వస్తున్న సందర్భంగా శనివారం ఆయన ముందస్తుగా పర్యటించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 10 గంటలకు కేసీఆర్ ధరావత్ తండా పరిధిలోని చింత బావితండా, పచ్చర్లబావి తండా పరిధిలో ఎండిన వరి పొలాలను పరిశీలిస్తారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఏడాదిలో రెండు సార్లు దేవాదుల రిజర్వాయర్ల నీటిని చెరువులు, చెక్‌డ్యాముల్లో నింపారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వారి చేతగానితనంతో రైతులకు సాగు నీరు అందడంలేదన్నారు. ఈ విషయంలో కేసీఆర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడుతారన్నారు. మార్పు కోరిన రైతులు పంటలను మాడ్చుకున్నారని, ఇకనైనా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే పాత రోజులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, బస్వ మల్లేశ్, కొల్లూరు సోమయ్య, చింత రవి, మలిపెద్ది శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌నాయక్,వంగ అర్జున్, సోమనర్సయ్య, కృష్ణమూర్తి, కారుపోతుల యాదగిరి, బస్వ వెంకన్న, మహేశ్, బొందుగుల సోమయ్య ఉన్నారు.



ధరావత్ తండాలో కేసీఆర్ పర్యటించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి





హనుమకొండ బస్‌స్టేషన్‌లో బస్సుల్లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు, రద్దీగా ఉన్న బస్‌స్టేషన్

# బస్సుల్లేక అగచాట్లు

పదో తరగతి పరీక్షలు ముగిశాయి. సెలవులు కూడా రావడంతో విద్యార్థులు తమ ఊళ్లకు పయనమయ్యారు. శనివారం విద్యార్థులు వారి తల్లిదండ్రులతో హనుమకొండ బస్‌స్టేషన్ కిక్కిరిసింది. కానీ ప్రధాన రూట్లలో సరిపడా బస్సుల్లేక గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఓ వైపు భానుడి భగభగలు.. మరో వైపు బస్సులు కానరాక నానా అగచాట్లు పడ్డారు.



*- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్*

# కాంగ్రెస్, బీజేపీవి కుట్ర రాజకీయాలు

- రాష్ట్రంలో కరువు తెచ్చిన కాంగ్రెస్
- రేపు ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం
- వరంగల్ ఎంపీ అభ్యర్థి ప్రకటన
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

మడికొండ, మార్చి 30 : కాంగ్రెస్, బీజేపీ కుట్ర రాజకీయాలు చేస్తున్నాయని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. కాజీపేట మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణను 10 ఏళ్లలోనే దేశానికే అన్నం పెట్టే విధంగా తీర్చిదిద్దారని చెప్పారు. అనేక ప్రాజెక్టులు నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించారన్నారు. రైతులకు విద్యుత్, ఎరువులు, నీళ్ల కొరత లేకుండా చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన 420 రకాల పథకాలు, 6 గ్యారెంటీలను ఇంకా అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ప్రకృతి సహజంగా కరువు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమే కరువును సృష్టిస్తోందన్నారు. పంటలకు నీరందక ఎండుతున్నాయని, దీంతో రైతు ఆత్మహత్యలు పునరావృతం అవుతున్నాయన్నారు. మహాలక్ష్మి పథకం ఆటో డ్రైవర్లకు కష్టాలు తెచ్చి పెట్టిందని, వారి సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధును రెట్టింపు చేయాలని కోరారు. పార్టీ మారినోళ్లను చెప్పులు, రాళ్లతో కొట్టాలని రేవంత్‌రెడ్డి పలు సభల్లో చెప్పారని, ఇప్పుడేమో బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలని చోటేభాయ్, బడే భాయ్ మిలాఖత్ అయ్యారని ఆరోపించారు. అవకాశవాదులు, స్వార్థపరులు పార్టీని వీడినా ఓరుగల్లులో బీఆర్ఎస్ ఎదిగేందుకు శ్రేణులు కృషి చేయాలన్నారు. ఏప్రిల్ ఒకటిన మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేసి ఎంపీ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, బండా ప్రకాశ్, మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, జడ్పీ చైర్మన్ సుధీర్‌బాబు హాజరవుతారని చెప్పారు.

**కడియం పార్టీ మారడం సిగ్గుమాలిన చర్య : మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్**

బీఆర్ఎస్‌లో సరైన నాయకత్వం లేదని, అంతర్గత విభేదాలు లేనిపోని మాటలు చెప్పేందుకు కడియం శ్రీహరికి సిగ్గుండాలని మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్ అన్నారు. బీఆర్ఎస్ బీ ఫామ్ మీద గెలిచిన కడియం శ్రీహరి కూతురు కావ్య పార్టీకి కేడర్ లేదని బీఆర్ఎస్‌పై బురద జల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. కాంగ్రెస్‌తో చేసుకున్న ముందస్తు ఒప్పందం ప్రకారమే ఈ నాటకం ఆడినట్లు ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. పార్టీ కోసం ఎప్పుడూ పనిచేయలేదని, ప్రతిపక్షంలోకి వెళ్లిన వెంటనే అధికార పార్టీ గుర్తొస్తుందంటే 40 ఏళ్ల అనుభవం ఏమైందని విమర్శించారు. ఎస్సీ రిజర్వేషన్ వాడుకుంటూ రాజకీయ లబ్ధి పొందారే తప్ప ఒక్క ఎస్సీ సర్పంచ్‌ను, జడ్పీటీసీని, ఎంపీటీసీని ఎమ్మెల్యే స్థాయి నాయకుడిగా తయారు చేయలేదన్నారు. సమావేశంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్ సంకు నర్సింగ్, నాయకులు నార్లగిరి రమేశ్, మహమూద్, శంకర్, చందర్, సుంచు కృష్ణ, మర్యాల కృష్ణ, గబ్బెట శ్రీనివాస్, అఫ్జల్, ఎండీ సోని, రామ్మూర్తి పాల్గొన్నారు.